www.jananinadam.com

RNI NO:TGTEL/25/A0870

Follow:

# జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం

తెలుగు దినపత్రిక



**జిల్లా వారిగా విలేకర్లు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ . అవినీతి పై సమరాన్ని సాగిస్తున్న జననినాదం తెలుగు దినపత్రికలో చేయుటకు అను భవం ఉన్న ఆసక్తి గత వారికి అవకాశం కలదు. అన్ని జిల్లా లు,డివిజన్లు, మున్సిపల్ మరియు మండలాల వారిగా విలేకరుల కావలేను.

సంప్రదించాల్సి నెంబర్

9550100197,9490111460



గురువారం 09-07- 2026

సంపుటి: 2 సంచిక:73

ఆసిఫాబాద్ Asifabad | హైదరాబాద్ Hyderabad | ఎడిటర్ : జాధవ్ రోహిదాష్ Editor: JADAV ROHIDAS

పేజీలు : 04

వెల: రూ.2.00

Simultaneously published from , Asifabad, Karimnagar, Adilabad , www.jananinadam.com


## వైఎస్సార్ కు షర్మిల నివాళులు



**కడప08:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత కాంగ్రెస్ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 77 వ జయంతి సందర్భంగా ఇడుపులపాయ వైఎస్సార్ ఘాట్ వద్ద ఏపీసీసీ చీఫ్ షర్మిల నివాళులు అర్పించి, ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. షర్మిల మాట్లాడుతూ. కాలం మారినా తెలుగు నేలపై నాన్నది ఎప్పటికీ చెరగని సంతకం. మరణం లేని మహానాయకుడు జూఖీ. సంక్షేమానికి, అభివృద్ధికి శాశ్వత చిరునామా జూఖీ. రాజశేఖర్ రెడ్డిని స్మరించుకుంటున్న కోట్లాది తెలుగు ప్రజలకు రెండు చేతులు జోడించి కృతజ్ఞతలు చెప్తున్నానని అన్నారు.

## చెరువులను కాపాడితేనే వరదలకు చెక్

**హైడ్రా కమిషనర్**



**హైదరాబాద్ 08:** హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, ముంబై, ఢిల్లీ లాంటి నగరాల్లో వరదలు రావడానికి చెరువులు, కాలువల ఆక్రమణకు గురికావడమే ప్రధాన కారణమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. ముస్సోరీలోని ఐఏఎస్ అధికారుల శిక్షణలో ఆయన ప్రసంగిస్తూ. సహజ నీటి ప్రవాహ మార్గాలను, గొలుసుకట్టు చెరువులను కాపాడుకుంటేనే వరదలను అరికట్టగలమని చెప్పారు. అందుకే హైదరాబాద్‌లో చెరువులు, కాలువల పరిరక్షణకు హైడ్రా ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని వివరించారు.



## మావోయిస్టులే నయం

## డ్రగ్స్ పెడ్లర్స్‌పై డీజీపీ సీవీ ఆనంద్

**హైదరాబాద్ 8:** తెలంగాణ డ్రగ్ పెడ్లర్స్ కంటే మావోయిస్టులే నయమని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. గతంలో మావోయిస్టులు గంజాయికి వ్యతిరేకంగా ఉన్నారని, ఇప్పుడు మావోయిస్టుల ప్రభావం తగ్గడంతో గంజాయి రవాణా విస్తరించిందని తెలిపారు. క్రైమ్ రివ్యూ నిర్వహించిన ఆయన, నట్టింట్లోకి, స్కూళ్ల దగ్గర చాక్లెట్ల రూపంలో డ్రగ్స్ చేరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడే డ్రగ్స్?ను అరికట్టకుంటే భవిష్యత్తులో ప్రమాదం తప్పదని, గంజాయి నిర్మూలనకు అందరం కలిసి యుద్ధం చేద్దామని పిలుపునిచ్చారు.



## సీఎం రేవంత్ రెడ్డితో గోద్రేజ్ ప్రతినిధుల భేటీ

**తెలంగాణలో ప్రైవేటు సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్, ఆయిల్ పామ్ సాగు విస్తరణ**

2వ పేజీలో...

**హైదరాబాద్ 08:** తెలంగాణలో ప్రైవేటు సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్, ఆయిల్ పామ్ సాగు విస్తరణ తదితర అంశాలపై గోద్రేజ్ ఆగ్రోవెట్ కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తో చర్చించారు. రాష్ట్రంలో మొట్టమొదటి ప్రైవేటు సమీకృత ఆయిల్ పామ్ సాగు విస్తరణపై ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు నివేదికను అందించారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్లో ముఖ్యమంత్రి తో గోద్రేజ్ గ్రూపు సంస్థల కార్పొరేట్ అఫేర్స్ ప్రెసిడెంట్ రాకేష్ స్వామి, ఆగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగత నియోగి భేటీ అయ్యారు. ఖమ్మం జిల్లాలో 300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న ప్రాజెక్టు ద్వారా 700 మందికి పైగా ఉపాధి కల్పించనున్నట్టు ప్రతినిధులు వివరించారు. ఇందులో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, నర్సరీ, పరిశోధన ? అభివృద్ధి కేంద్రం, సీడ్ గార్డెన్ ఏర్పాటు కోసం ఖమ్మం జిల్లా కొనిజర్ల



## బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆషాడ బోనాల ఉత్సవాలు, కళ్యాణోత్సవాన్ని దేదీప్యమానంగా నిర్వహించాలి

**మంత్రి కొండా సురేఖ**

2వ పేజీలో...

**హైదరాబాద్ 08:** బల్కంపేట అమ్మవారి దయతో రాష్ట్రం సుభిక్షంగా వుండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారికి మొక్కుకున్న మంత్రి కొండా సురేఖఆషాడ బోనాల ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవాన్ని అత్యంత శోభాయమానంగా, కన్నుల పండువగా నిర్వహించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండా సురేఖ గారు అధికారులను ఆదేశించారు. ఏడు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ఎల్లమ్మ అమ్మవారు బల్కంపేటలో కొలువై వుండటం తెలంగాణ రాష్ట్రానికి మంగళప్రదం అని మంత్రి అన్నారు. ఈ నెల 20, 21, 22 తేదీల్లో నిర్వహించనున్న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణోత్సవ సమన్వయ సమావేశంలో మంత్రి సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ అమ్మవారి దర్శనం చేసుకుని, పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి



## నాగర్ కర్నూల్ జిల్లాలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ 08:** నాగర్ కర్నూల్ పట్టణంలో 50 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని ప్రారంభించారు..జిల్లా రవాణా శాఖ కార్యాలయం లో రాష్ట్రంలో అగ్రగామిగా ఉండాలని,రోడ్ సేఫ్టీ పై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ రవాణా శాఖ అధికారులు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా నాగర్ కర్నూల్ లోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్ లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు.భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు వనమహోత్సవంలో భాగంగా భరోసా కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి,జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ , అడిషనల్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ రమేష్, డిటిసి లు ఇస్మాయిల్, వాణి, రవీందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇంకెన్నాళ్లు కాళేశ్వరంపైకట్టుకథలు

**నీళ్లు లేక రైతులు అవస్థలు పడుతుంటే చోద్యమా**
**గోదావరి నీళ్లు ఎత్తిపోయడమే శరణ్యం**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**




**హైదరాబాద్,జూలై8:** ఒకపక్క నీళ్లు లేక వ్లలెల్లో రైతన్నల కన్నీళ్లు పెట్టుకుంటుంటేమరోపక్క మేడిగడ్డ కాడ లక్షల క్యూసెక్కుల నీళ్లు వృథాగా కిందకు పోతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంలో నీరో చక్రవర్తిని మించిపోయి సర్కారు తమాషా చూస్తున్నదని మండిపడ్డారు. కేసీఆర్ మీద కక్షతో రైతన్నలకు శిక్ష వేయడం తగునా అని నిలదీశారు. ఎలినినో పడగ విప్పుతుంటే.. ముప్పు ముంచుకొస్తుంటే ఇంకా రాక్షస రాజకీయ క్రీడలు ఆడుతూ

## ఉయ్యాలవాడ గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన మంత్రి పొన్నం



**నాగర్ కర్నూలు08:** నాగర్ కర్నూల్ జిల్లా బిజినిపల్లి మండలం ఉయ్యాలవాడ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం నాడుఆకస్మిక తనిఖీ చేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ,జిల్లా కలెక్టర్, ఎస్పీ , అధికారులు తదితరులు పాల్గోన్నారు. విద్యార్థులు పాఠశాలలు పునఃప్రారంభం అయినప్పటి నుండి ఇప్పటి వరకు జరిగిన పాఠ్యాంశాల పై మంత్రి ఆరా తీసారు. విద్యార్థుల సమస్యల పై అడిగి తెలుసుకుని ..విద్యార్థులు స్నానాలు చేయడానికి వేడి నీరు రావడానికి సోలార్ ప్లాంట్ మంజూరు చేసారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు అందుతున్న మెనూ అందుతున్న బోజన వివరాలు అడిగి తెలుసుకుని స్టోర్ రూమ్ లో వంట సరుకుల నాణ్యత పరిశీలించారు. వంట గది లో వండిన ఆహార పదార్థాలను పరిశీలించి కూరగాయలు పరిశీలించారు.. తాజా కూరగాయలు వంటల్లో ఉపయోగించాలని సూచించారు.

## నేడు బనగానపల్లెకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**కొలిమిగుండ్ల 08:** నేడు బనగానపల్లె పట్టణంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వస్తున్న సందర్భముగా సభకు వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. కావున కొలిమిగుండ్ల మండలం నుండి టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని కొలిమిగుండ్ల టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి తెలిపారు. అలాగే అవుకు మండలం నుండి కూడా సీఎం సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని అవుకు మండల టిడిపి అధ్యక్షుడు ఐ. ఉగ్రసేనారెడ్డి మండల ప్రజలకు పిలుపునిచ్చారు.





## గుడిసెల్లో నివసిస్తున్న ప్రతి పేదవాడికి శాశ్వత గృహం

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

2వ పేజీలో...

**వనపర్తి 08:** వనపర్తి పేదవాడికి అండగా ఉంటారని, పేదల అభ్యున్నతికి అంకిత భావంతో పాటు పడతారని రాష్ట్ర ప్రజలు నమ్మి ఈ ప్రభుత్వాన్ని బలపరిచిందని, ప్రజల నమ్మకాన్ని తల తాకట్టు పెట్టీ అయిన ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.ప్రజా ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తోందని, తద్వారా పేదల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడమే లక్ష్యంగా సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.×బిబుధవారం వనపర్తి జిల్లాలో పర్యటించి సహచర మంత్రులు రాష్ట్ర ఆబ్కారీ,



## రామడుగు మండలం వెలిచాల గ్రామంలో ఘనంగా పోలీస్ మీ కోసం కార్యక్రమం

**పోలీసు కమిషనర్ గౌష్ ఆలం**

2వ పేజీలో...

**కరీంనగర్ 08:** సైబర్ నేరాలు, డ్రగ్స్ రోడ్డు ప్రమాదాలపై అవగాహనా ప్రజలు అప్రమత్తంగా ఉండాలిశాంతిభద్రతల పరిరక్షణలో సీసీటీవీ కెమెరాల పాత్ర కీలకం.కమిషనరేట్ పరిధిలో మరో 700 కెమెరాల ఏర్పాటు లక్ష్యం– సీపీ గౌష్ ఆలం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వెలిచాల గ్రామం, రామడుగు మండలంలో బుధవారం "పోలీస్ మీ కోసం" అవగాహన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన 40 సీసీటీవీ కెమెరాలను పోలీసు ఉన్నతాధికారులు రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సదస్సుకు గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు దాదాపు 500 మందికి పైగా భారీ సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడిన పోలీస్ కమిషనర్ శాంతిభద్రతల పరిరక్షణలో మరియు నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానం, ముఖ్యంగా సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను వివరించారు.వాటిలో ముఖ్యంశాలు: సాంకేతికతతో నిఘా సీసీటీవీల ఏర్పాటు వెలిచాల గ్రామంలో పాత కెమెరాల స్థానంలో నలభై అధునాతన సాంకేతికతతో

జననినాదం గురువారం 09 జూలై 2026

# గ్రంథాలయం.. జ్ఞానానికి కొత్త గూటి కాగజ్‌నగర్‌లో

## నూతన గ్రంథాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న

**ఎంపీ గొడం నగేష్**



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి జూలై 08:** గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలని, యువత వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఎంపీ గొడం నగేష్ అన్నారు. జిల్లాలోని కాగజ్‌నగర్ పట్టణం కావువాడలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రంథాలయ భవనాన్ని బుధవారం కలెక్టర్ కె. హరిత, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్డె అనిల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సమాజంలో విజ్ఞాన వికాసానికి గ్రంథాలయాలు కీలకమని పేర్కొన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ పరిణామాలతో పాటు భారత చరిత్ర, సంస్కృతికి సంబంధించిన విలువైన గ్రంథాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయని తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, స్థానికులు పాల్గొన్నారు.

# వంట కోసం నాణ్యమైన సరుకులే వినియోగించాలి

**కలెక్టర్ కె. హరిత**
**కాగజ్ నగర్ పీఎం శ్రీ ఉన్నత పాఠశాల తనిఖీ**
**మూత్ర శాలలు, మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశం**
**తాసిల్దార్ కార్యాలయంలో భూ భారతి, సాదా బైనామా దరఖాస్తుల పరిశీలన**



**జననినాదం,కాగజ్‌నగర్,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి జూలై 08:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన, పౌష్టిక మధ్యాహ్న భోజనం అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ కె. హరిత ఆదేశించారు.బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని పాత ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, తరగతి గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వంటకు నాణ్యమైన, గడువు చెల్లని సరుకులనే వినియోగించాలని, కాలం చెల్లిన నిత్యావసర వస్తువులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించరాదని సూచించారు. వంటశాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. మూత్రశాలలు, మరుగుదొడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఏకాగ్రతతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠశాల ఆవరణలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కూడా సందర్శించి విద్యా బోధన, మౌలిక సదుపాయాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.తదనంతరం పట్టణంలోని త్రిశూల్ పహాడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు స్వయం ఉపాధి, క్యాంపస్ ప్లేస్‌మెంట్‌పై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు.అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి, సాదా బైనామా దరఖాస్తుల పరిశీలన, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతుల పరిష్కార ప్రక్రియ, కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి రికార్డులతో సరిపోల్చి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అలాగే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాల కోసం వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ సరిత, మండల విద్యాధికారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ సదస్సుకు ఎంపికైన డిపిఆర్ఓ సంపత్ కుమార్‌కు ఘన సన్మానం

**జర్నలిస్టులకు ఆయన సేవలు అభినందనీయమని టీయూడబ్ల్యూజే (ఐజేయు) ప్రశంస**



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి జూలై 08:** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి (డిపిఆర్ఓ) సంపత్ కుమార్‌కు టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘన సన్మానం నిర్వహించారు. ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆసిఫాబాద్ జిల్లా నుంచి ఎంపికై హాజరైన సందర్భంగా జిల్లా కేంద్రంలోని డిపిఆర్ఓ కార్యాలయంలో ఆయనను శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ, మారుమూల వెనుకబడిన జిల్లాకు చెందిన అధికారి జాతీయ స్థాయి సదస్సుకు ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణమన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంపత్ కుమార్ ఎల్లప్పుడూ సానుకూలంగా స్పందిస్తూ, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగేలా కృషి చేస్తున్నారని కొనియాడారు.ప్రభుత్వం, పాలకులు, మీడియా ప్రతినిధుల మధ్య సమన్వయ వారధిగా వ్యవహరిస్తూ ప్రభుత్వ సమాచారాన్ని వేగంగా ప్రజలకు చేరవేస్తున్నారని పేర్కొన్నారు. సమాచార శాఖ సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ జర్నలిస్టులకు అందుబాటులో ఉంటున్న ఆయన సేవలు అభినందనీయమని అన్నారు.కార్యక్రమంలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు ప్రకాష్ గౌడ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్. వేణుగోపాల్, టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు, జిల్లా సంయుక్త కార్యదర్శి దేవునూరి రమేష్, ప్రెస్ క్లబ్ కోశాధికారి శ్రీధర్‌తో పాటు జిల్లా నాయకులు నగరాజ్, సురేష్ చారి, రాధాకృష్ణ చారి, రాజు, జానకిరామ్, నితీష్, మోహన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 08:** ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని జన్నారం మండలం అక్కపల్లిగూడ గ్రామంలోని మండల పరిషత్ ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాలను జన్నారం మండల తహసిల్దార్ బక్కయ్య, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉమర్ షరీఫ్ లతో కలిసి సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న బోధనా తీరు, రిజిస్టర్లు, వంటశాల, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పొనకల్ గ్రామంలోని భవిత వనరుల కేంద్రం, మండల పరిషత్ ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదులు, మూత్రశాలలు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి వంటశాల, ప్రహరీ గోడ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కవ్వాల్ గ్రామంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి తరగతి గదులు, పరిసరాలు పరిశీలించి విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఓ.పి. రిజిస్టర్, వార్డులు, మందుల నిల్వలు, పరిసరాలు పరిశీలించి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణీలు, ప్రజల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి, ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలుపై సమీక్షించారు. భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 24వ తేదీ లోగా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులకు మంజూరైన ఇండ్లు నిర్మాణం త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు.అనంతరం దండేపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, ఓ.పి. సేవలు, ప్రతిరోజు ఆసుపత్రికి వస్తున్న ప్రజల వివరాలను పరిశీలించారు. గర్భిణులు ఆసుపత్రులలోనే ప్రసవాలు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రైవేట్ ఆసుపత్రులలో జరుగుతున్న ప్రసవాల వివరాలను సేకరించి పోర్టల్ లో నమోదు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. వర్షాకాలం అయినందున అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, నీటిని కాచి చల్లార్చి వడపోసి తాగే విధంగా ప్రజలకు సూచించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చే ప్రజలలో వ్యాప్తి చెందుతున్న వ్యాధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ ఆశయాల సాధనకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

**డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క**



**జననినాదం, జైనూర్ 08:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాల సాధనకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తోందని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అన్నారు. బుధవారం జైనూర్ మండల కేంద్రంలో నిర్వహించిన వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్‌తో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళల సంక్షేమానికి వైఎస్సార్ అమలు చేసిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రజా సంక్షేమమే పాలన లక్ష్యంగా పనిచేసిన మహానేతగా వైఎస్సార్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ఆయన చూపిన సంక్షేమ పాలన స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మరింత చేరువై వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యవర్గ సభ్యులు పెందోర్ ప్రకాష్, సుద్దాల శ్రీనివాస్, సర్పంచ్ మాడవి మనోహర్, తొడసం రాజేందర్, ఉయిక చందు, మెస్రం స్పందన భూపత్, మాజీ వైస్ ఎంపీపీ షేక్ రషీద్, చెల్లె లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ హైమద్ ఖాన్, నాయకులు లచ్చు, ఆత్రం ప్రకాష్, రహీమ్, కోటేష్, అబ్దుల్లా, సిద్దు, బాపూరావ్, దత్తు, మహమ్మదు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్యాబోధనకు కృషి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)**
**జిల్లా విద్యాశాఖ అధికారి పి. చంద్రయ్య**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 08:** ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఒ జిల్లా విద్యాశాఖ అధికారి పి. చంద్రయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు బలమైన పునాది వేయడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, ఎప్పటికప్పుడు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఆధునిక బోధనా పద్ధతులను అనుసరించాలని తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థిగా ఉంటూ తన విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, తరగతి గదిలో విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మక ఆలోచనలను పెంపొందించే విధంగా బోధన సాగించాలని సూచించారు. విద్యార్థులు కొత్త విషయాలు, ఆవిష్కరణలు, పరిశోధనల పట్ల ఆసక్తి కనబరిచేలా ప్రోత్సహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కో-ఆర్డినేటర్ జంబోజు సత్తయ్య, సెక్టోరియల్ అధికారులు భరత్ కుమార్, కృష్ణమూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్, ప్రధానోపాధ్యాయులు బండి రమేష్, రిసోర్స్ పర్సన్స్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.బెల్లంపల్లిమండలంలోని బుద్ధకాలన్ గ్రామపంచాయతీలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేసి వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. గ్రామాలను పరిశుభ్రంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దడంలో ఘన, ద్రవ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు గ్రామపంచాయతీలు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించి, వన మహోత్సవం కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యులను చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎన్.కిషన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహేందర్, పంచాయతీరాజ్ డి.ఈ.ఈ. రవీందర్, గ్రామ సర్పంచ్ దాడి నాగేశ్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చింతల మాధర అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

**డీఎఫ్‌వోను కోరిన ఎకో టూరిజం కమిటీ చైర్మన్ తుంరం గోపాల్**



**జననినాదం,తిర్యాణి 08:** చింతల మాధర వాటర్‌ఫాల్ అభివృద్ధితో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి అటవీ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎకో టూరిజం కమిటీ చైర్మన్ తుంరం గోపాల్ అన్నారు. బుధవారం వాటర్‌ఫాల్‌ను సందర్శించిన డీఎఫ్‌వోకు కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత రెండేళ్లుగా ఎకో టూరిజం కమిటీ నిర్వహణకు సంబంధించిన లెక్కలను పరిశీలించి పారదర్శకంగా వెల్లడించాలని డీఎఫ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. వాటర్‌ఫాల్ అభివృద్ధి పనులను వేగవంతం చేసి పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వినతిపై డీఎఫ్‌వో సానుకూలంగా స్పందించి, అన్ని సమస్యలను పరిశీలించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, సెక్షన్ ఆఫీసర్ రాంసింగ్, ఎకో టూరిజం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ సాధించిన రాహుల్ యువతకు ఆదర్శం

**గిరిజన చైతన్యంపై పరిశోధన సమాజానికి మార్గదర్శకం**

**డా. కొండగుర్ల కమలాకర్**



**జననినాదం,ఆదిలాబాద్ జూలై 08:** ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకుని డాక్టరేట్ సాధించిన యువ పరిశోధకుడు బాన్సుడే రాహుల్ నేటి యువతకు ఆదర్శంగా నిలిచారని సమాచార హక్కు రక్షణ చట్టం--2005 సొసైటీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కొండగుర్ల కమలాకర్ అన్నారు. ఇటీవల పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందిన రాహుల్‌ను సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల రవీందర్ అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా గిరిజన వర్గాల్లో రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడంలో విద్య, మీడియా పాత్రపై రాహుల్ చేసిన పరిశోధన సమకాలీన అవసరాలకు అనుగుణంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ పరిశోధన గిరిజన ప్రాంతాల్లో విద్య, మీడియా, రాజకీయ అవగాహనపై మరింత చర్చకు దోహదపడటమే కాకుండా సమాజానికి ఉపయోగపడే అంశాలను వెలికితీసిందన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే విద్యాభ్యాసం పూర్తి చేసి ఉన్నత విద్యను అందుకోవడం రాహుల్ కృషికి నిదర్శనమన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పట్టుదలతో లక్ష్యాన్ని సాధించవచ్చని ఆయన నిరూపించారని చెప్పారు. నేటి విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసంపై దృష్టి సారించి రాహుల్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సామాజిక సేవలోనూ రాహుల్ ముందుంటూ పేద, వెనుకబడిన విద్యార్థులకు విద్యాపరంగా అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకునిగా విధులు నిర్వహిస్తూ భావి తరాన్ని తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. విద్య ద్వారానే సమాజంలో సానుకూల మార్పు సాధ్యమవుతుందని, యువతలో సేవాభావం పెంపొందాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ--ఎస్టీ యాక్ట్ డివిజన్ సభ్యుడు సోన్ కాంబ్లే సూరజ్, సొసైటీ జిల్లా కమిటీ సభ్యులు జితేందర్, ఆదిలాబాద్ మండల అధ్యక్షుడు భూమన్న, సామాజిక కార్యకర్త శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## టాస్క్ ద్వారా ముగ్గురు జిల్లా వాసులకు ఉద్యోగాలు



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 08:** నిరుద్యోగ యువతకు టాస్క్ కేంద్రంగా వివిధ సాంకేతిక కోర్సులలో అందిస్తున్న శిక్షణ ద్వారా జిల్లాకు చెందిన ముగ్గురికి క్యాంపస్ ప్లేస్మెంట్ లో ఉద్యోగాలు లభించాయని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ సాంకేతిక కోర్సులలో శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా టాస్క్ కేంద్రం ద్వారా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో టాస్క్ కేంద్రంలో శిక్షణ పొందిన జి. కావ్య, ఎమ్. అంజలి, కె. సాయివాణి లు అత్యున్నత ప్రతిభ కనబరిచి టిసిఎస్ (TCS) క్యాంపస్ ప్లేస్మెంట్ ఎంపికై ఉద్యోగాలు పొందడం అభినందనీయమని తెలిపారు. టాస్క్ కేంద్రంగా అందిస్తున్న శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ ముస్కాన్-12 ముమ్మరం.

**గిరిజన గ్రామాల్లో తనిఖీలు,, బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు**

**ఎస్సై బిక్కు లాల్,**



**జననినాదం,సిర్పూర్(యు),కెరమెరి జూలై 08:** జిల్లాలో బాల కార్మిక నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్-12 కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా బుధవారం కెరమెరి మండలంలోని గిరిజన గ్రామాలైన అంబరావుగూడ, గోయగాం, కొఠారి ప్రాంతాల్లో పోలీసులు, బాలల సంక్షేమ శాఖ అధికారులు సంయుక్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎస్సైలు బిక్కులాల్, ఉల్లాస్ జాదవ్, బాలల సంక్షేమ శాఖ అధికారులు చంద్రశేఖర్, సుకన్య ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల సందర్భంగా పని ప్రదేశాలు, దుకాణాలు, ఇతర ఉపాధి కేంద్రాలను పరిశీలించి బాల కార్మికులు ఉన్నారో లేదో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, జిల్లాలో జూలై 1 నుంచి 31 వరకు మూడు ప్రత్యేక బృందాలతో ఆపరేషన్ ముస్కాన్-12 నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బాలలను పనుల్లో పెట్టుకోవద్దని యజమానులను హెచ్చరించారు. బాల కార్మికులను గుర్తిస్తే వారిని రక్షించి పునరావాసం కల్పించడంతో పాటు సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. బాలలను తిరిగి పాఠశాలల్లో చేర్పించి విద్యాభ్యాసం కొనసాగించేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఎక్కడైనా బాల కార్మికులు కనిపించినా లేదా పనిలో పెట్టుకున్నట్లు సమాచారం తెలిసినా వెంటనే అధికారులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. ఈ తనిఖీల్లో ఎస్సై ఉత్తం, పోలీస్ కానిస్టేబుళు దినేష్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజలు సహకరించాలి



**జగిత్యాల08:** సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కోరారు. జూలై 8న జగిత్యాల మున్సిపల్ 8వ వార్డులో పారిశుద్ధ్యం, డ్రై డే, యాంటీ లార్వా చర్యలు మరియు ఫీవర్ సర్వేలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి ఇంటిని తనిఖీ చేసి పాత టైర్లు, కూలర్లు, పూల కుండీలలో నీరు నిల్వ లేకుండా చూడాలని, దోమల నివారణకు యాంటీ లార్వా స్ప్రేలు, ఆయిల్ బాల్స్ వాడాలని అధికారులను ఆదేశించారు. డెంగ్యూ, చికున్గున్యా, మలేరియా వంటి వ్యాధులు పరిసరాల పరిశుభ్రతతోనే నియంత్రించవచ్చని, "మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం" అనే సందేశాన్ని ప్రతి ఇంటికి చేరేలా ప్రచారం చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, పరీక్షా కిట్లు అందుబాటులో ఉంచాలని కూడా ఆయన తెలిపారు.

## ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్



**ములుగు08:** ఈవీఎం గోదాం ను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు నెలవారి తనిఖీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నెలవారి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ ను పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, అగ్నిప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను తనిఖీ చేశారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు.

## వానలు లేకపోయిన గోదావరి

**హైదరాబాద్, జూలై 8:** తెలుగు రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ప్రతి ఏటా ఈ సమయానికి కురవాల్సిన సాధారణ వర్ష శాతం కంటే తక్కువ శాతం వర్షాలు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో కురిశాయి. ఇదంతా ఒకవైపు. మరోవైపు గోదావరి నది నీటిమట్టం అంతకంతకు పెరుగుతోంది. క్రమంగా గోదావరి ఉగ్రరూపం దాలుస్తోంది. దీనికి కారుణం... ఎగువన మహారాష్ట్ర, ఒడిసా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో దంచికొడుతున్న వర్షాలే. భారీ వర్షాలతో గోదావరి ఉపనదులు పొంగిపొర్లుతూ గోదావరిలోకి వచ్చి చేరుతున్నాయి. దీంతో వరద ప్రవాహం భారీగా పెరిగింది. పోలవరం ప్రాజెక్టుకు ఏకంగా లక్ష క్యూసెక్కుల నీరు ఉరకలెత్తుతోంది. దీంతో, అలర్ట్ అయిన జలవనరుల శాఖ అధికారులు 48 గేట్లను ఎత్తివేసి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అయితే, స్పిల్‌వే నుంచి వరద నీరు ఊహించని వేగంతో దూసుకురావడంతో.. స్పిల్ చానల్ మధ్య 902 హిల్ నుంచి మహానందీశ్వరస్వామి టెంపుల్ వరకు ఉన్న మట్టి, రాతి రవాణా కాజ్‌వేకు గండిపడింది. ప్రాజెక్టు పనుల కోసం వాహనాలు తిరిగేలా నిర్మించిన ఈ కాజ్‌వే వరద తాకిడికి కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇటు దిగువన ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద కూడా గోదావరి నీటిమట్టం శరవేగంగా పెరుగుతోంది. ప్రవాహం ఇంతకంటే ఎక్కువైతే, బ్యారేజ్ గేట్ల ఎత్తి నీటిని నేరుగా దిగువకు వదిలేస్తారు. కిందకు వదిలిన నీరంతా సముద్రంలో కలవనుంది.

## ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను వేగవంతం చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 08:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని నెన్నెల మండల కేంద్రం, మందమర్రి పట్టణంలోని జోన్ 1, 2 లను ఆయా మండలాల తహసిల్దార్లతో కలిసి సందర్శించి బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేయడం జరిగిందని, పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాల వివరాలు నమోదు చేసిన తర్వాత తిరిగి తీసుకుని డిజిటలైజ్ చేయాలని తెలిపారు. వాలంటీర్లు, బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్ల సహాయంతో ఎన్యూమరేషన్ ఫారాలలో వివరాల నమోదు ప్రక్రియపై ఓటర్లకు అవగాహన కల్పించాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. అనంతరం మందమర్రి, నెన్నెల, బెల్లంపల్లి మండలాల తహసిల్దార్ కార్యాలయాలను బి సెక్షన్ సూపరింటెండెంట్ తో కలిసి సందర్శించి సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, భూభారతి పెండింగ్ దరఖాస్తులు, ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ వేగవంతం, భూ సేకరణ సంబంధిత అంశాలపై కార్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో భాగంగా ఓటర్ల వివరాలు నమోదు చేసిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1 వేయి 200 మంది ఓటర్లకు మించకుండా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రణాళిక ప్రకారం చేపట్టాలని తెలిపారు. సాదాబైనమా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి భూభారతి పోర్టల్ ను అందుబాటులోకి తీసుకువచ్చి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, విరాసత్ ఇతర సేవలను, భూ సంబంధిత సేవలను నిబంధనల ప్రకారం వేగవంతంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల పరిష్కరణ వేగవంతం చేయాలని, సర్టిఫికెట్లను నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోగా జారీ చేయాలని తెలిపారు. కార్యాలయ సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, కార్యాలయానికి వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసిల్దారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తాడిచర్ల బ్లాక్-2 కేటాయింపు సింగరేణికి వరం

**కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో వేల మందికి ఉపాధి**

**కోడి రమేష్, సూరం సంపత్‌కుమార్**

**బీఎంఎస్ ఆధ్వర్యంలో సంబరాలు**

**ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం**



**జననినాదం, కాసిపేట 08:** తాడిచర్ల బ్లాక్-2 బొగ్గు గనిని ఎలాంటి వేలంపాట లేకుండా కేంద్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు కేటాయించడం సంస్థ భవిష్యత్తుకు కీలక మైలురాయని మంచిర్యాల జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కోడి రమేష్, కాసిపేట మండల అధ్యక్షుడు సూరం సంపత్‌కుమార్ అన్నారు. బుధవారం కాసిపేట-2 మైన్ ఆవరణలో బీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడిచర్ల బ్లాక్-2 ద్వారా సింగరేణి సంస్థకు ఏటా భారీ స్థాయిలో బొగ్గు ఉత్పత్తితో పాటు వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుందని తెలిపారు. దాదాపు 1,200 మంది కార్మికులకు ప్రత్యక్ష ఉపాధి లభించనున్నదని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ భవిష్యత్తులో ఇతర బొగ్గు బ్లాకుల వేలంపాటల్లో పాల్గొంటే కేంద్ర ప్రభుత్వం మరిన్ని బ్లాకులను కూడా కేటాయించేందుకు సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు గుర్రం ప్రదీప్, ఏరియా కార్యదర్శి చెట్టి వీరన్న, కేకే ఓసీ ఫిట్ సెక్రటరీ మంద రజనీకాంత్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరాజు, బీజేపీ జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి నగరారపు ప్రసన్న, బాకీ కిరణ్, ఆయిల్ సురేందర్, ఏరోజు శ్రీనివాస్, తోటపల్లి ఓంసాయి, బీఎంఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.


## మిట్టపల్లి బాలికల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



**సిద్దిపేట08:** రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు వడ్డించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి గురుకుల యాజమాన్యాలను ఆదేశించారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామ శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్నం, వెజిటేబుల్ బిర్యానీ, ఆలుగడ్డ తమాట, ఫ్రైడ్ గుడ్డు కూర, సాంబారు, పెరుగు లను పరిశీలించారు. వెజిటేబుల్ బిర్యాని నాణ్యత పరిశీలిస్తూ బిర్యానీ నాణ్యత చాలా బాగుందని అభినందించారు. ఇలాగే రోజు వారిగా కామన్ డైట్ మెనూ పాటిస్తున్నారా, చేసిన ప్రతి వంటకం రుచిగా ఉంటుందా అనీ ఆరా తీశారు. విద్యార్థుల హాజరు ప్రకారం కూరగాయలు, వంట సరుకులు కొలత ప్రకారం తీసుకోవాలని, ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజన ప్రక్రియను ప్రిన్సిపల్ లేదా ఒక ఉపాధ్యాయులు పర్యవేక్షణ చెయ్యాలని ఆదేశించారు. వంటగది, డైనింగ్ హాల్ పరిసర ప్రాంతాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గురుకుల ప్రాంగణం మొత్తం పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎక్కడ కూడా నీటి నిలువలు ఉండకుండా, దోమలు ఈగలు రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించాలని ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయులను ఆదేశించారు.

## రేణిగుంటలో ఇద్దరు పాత నేరస్థుల అరెస్ట్..

**ప్రతీకార దాడి కేసును ఛేదించిన పోలీసులు...**



**రేణిగుంట 08:** రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఒక దోపిడీ మరియు బెదిరింపుల కేసులో ప్రమేయం ఉన్న ఇద్దరు పాత నేరస్థులను బుధవారం ఉదయం పోలీసులు అరెస్ట్ చేశారు. రేణిగుంట సబ్ డివిజన్ పోలీసు అధికారి (డిఎస్పీ) వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో, అర్బన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ (సిఐ) ఎస్. జయచంద్ర నాయకత్వంలో, సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) కే. ధర్మారెడ్డి మరియు పోలీసు సిబ్బంది కలిసి నిర్వహించిన ప్రత్యేక తనిఖీలు, సాంకేతిక దర్యాప్తు ద్వారా ఈ అరెస్ట్ సాధ్యమైందని అధికారులు తెలిపారు. అరెస్ట్ అయిన నిందితులను తారకరామా నగర్‌కు చెందిన వెంకటగిరి వివేక్ (22), ఆవుల లక్ష్మణ కుమార్, అఖిల్ (23)గా గుర్తించారు. ఈ ఇద్దరు నిందితులు గతంలో అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బంగారు గొలుసు దొంగతనం కేసులో జైలు శిక్ష అనుభవించి విడుదలయ్యారు. అయితే, తాము జైలుకు వెళ్లడానికి తారకరామా నగర్‌కు చెందిన సేతు దిలీప్ కుమార్, తంబి అనే వ్యక్తే కారణమని భావించి అతనిపై కక్ష పెంచుకున్నారు. ఈ నెల 6వ తేదీ రాత్రి బాధితుడిని పిలిపించి, జైలు ఖర్చులు ఇవ్వాలంటూ దాడి చేసి, అతని వద్దనున్న రూ.1,000/- నగదును బలవంతంగా లాక్కొని ప్రాణహాని కలిగిస్తామని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచడానికి చర్యలు చేపట్టారు. ప్రజలకు ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాల సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తిరుపతి జిల్లా పోలీసు శాఖ తెలిపింది.

Printed, Published and Ownedby **JADAV ROHIDAS,** and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293.**Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197,9490111460